ఇంటి వాకిట నిలబడి తలుపు తడుతూ, "చూశావా! నీ రామ్మూర్తి ఎంత చక్కగా చదువుతున్నాడో" అనగలదని విశ్వేశ్వరంగారికి అనిపించింది. రైలు ఆగుతోంది. తిరిగి బయలుదేరుతోంది. "నేను పరీక్షల్లో ప్యాసయ్యానుగా చూశావా" అనగలడని అనిపించింది.

బండిలో ఎక్కవలసిన జనం ఎక్కుతున్నారు, దిగవలసిన జనం దిగుతున్నారు. ఒక మధ్యాహ్నం స్కూల్లో వుండగా రామ్మూర్తి మరణవార్త తనకు అందుతుందని భావించాడు. కాంతిలేని కళ్ళతో, పీలిక అయిన శరీరంతో, గాలి పీలుస్తుంటే కదిలే గొంతుకతో నిశ్శబ్దంగా నిలబడ్డ రామ్మూర్తి మళ్ళీ మళ్ళీ గుర్తుకొచ్చాడు. రైలు గుండెలు గుబులు కొలిపేలాగ చీకటిలో గావుకేకలు పెడుతున్నది. విశ్వేశ్వరంగారికి ఇంటిదాని మాట గుర్తుకొచ్చింది. "రామ్మూర్తీ మీ అమ్మ మాటయినా వినవురా? పోనీ మీ అమ్మ రమ్మంటుందిగా దాని మాటయినా విన్నావురా? మీ అమ్మ వొడిలోకి చేరటానికి నీకు అడ్డం వుండగల వాడెవడురా? చెప్పు. నీవే చెప్పు" అని ప్రశ్నించాడు. "అయితే నేనేనా నీకు అడ్డు!" సరిగ్గా ఈ నిర్ణయంతో విశ్వేశ్వరంగారు ఆ ఆలోచన వొదిలేశాడు. "తల్లికి కుమారునకు మధ్య అడ్డుగానుంచోమని ఇక యెవరూ నాకు నచ్చచెప్పలేరు" అనుకున్నాడు. చీకటిని చీల్చుకుంటూ ముందుకు పరిగెడుతున్న రైలు కొరివి దెయ్యంలాగ మండుతోంది. "అయితే నేనుమాత్రం నిన్ను శిక్షించలేననుకొన్నావురా పిచ్చి రామూ" అంటో నెమ్మదిగా తలను రైలు కిటికీకి ఆనించాడు విశ్వేశ్వరంగారు. అనేక రోజుల తరువాత, చివరిసారిగా అతని పెదవులమీద చిరునవ్వు ఉబికి వెంటనే అణగిపోయింది. తెల్లవారింది. విశ్వేశ్వరంగారి ఊళ్ళో రైలు ఆగింది, మళ్ళీ కూసి వెళ్ళిపోయింది. కాలంలాగే పొగలు కక్కుతూ నిర్లక్ష్యంగా మరో స్టేషనుకు.

స్కెచ్

# సంఘంలో చీడపురుగులు

"కృష్ణానంద్"

డాక్టరు వెంకటరత్నం గుర్రబ్బండీ దిగి లోపలికి వచ్చాడు. వెనకాలే కాంపౌండరు మందులపెట్టె పుచ్చుకొని దిగాడు. అందరి హృదయాలు ఏదో ధైర్యంతో స్తిమితపడ్డాయి. అంతవరకు కళాహీనంగా ఆదుర్దాగా వున్న రాఘవయ్యకు కొంచెం మనిషి రూపు వచ్చింది.

చేతిలో స్టెతస్కోపు ఊపుకొంటూ, తెచ్చిపెట్టుకొన్న తీవి సడలకుండా టకటకమంటూ రోగి మంచందగ్గరకు వచ్చాడు. కుర్చీ ఒకటి తీసుకువచ్చి మంచం ప్రక్కనే వేశాడు రాఘవయ్య. సూటు నలగకుండా జాగ్రత్తగా కూర్చున్నాడు డాక్టరు వెంకటరత్నం. ఏ కదలికా లేకుండా పడివుంది లలిత. తెల్లగా పాలిపోయివుంది. రోగిని పరీక్షించాడు. కాంపౌండరుని ఇంజక్షనుకు అన్నీ సిద్ధంచెయ్యమన్నాడు. అందరూ శూన్యంగా చూస్తున్నారు ఈ లోకంతో సంబంధం లేనట్లు పడివున్న లలితకేసి.

ఇంజక్షనిచ్చాడు డాక్టరు వెంకటరత్నం. ఏ క్షణం ఎలా వుంటుందోనన్న భయంతో కుమిలిపోతున్న మనస్సులతో ఆదుర్దాగా చూస్తున్నారు. డాక్టరు గడియారం కేసి చూస్తూ కూర్చున్నాడు.

అయిదు నిముషాలు...

నాడి అందుకొంది. కదలిక కనపడింది. బరువెక్కిన హృదయాలు తేలికపడ్డాయి. బరువుగా గాలిని వదిలాడు డాక్టరు వెంకటరత్నం. నుదుటిమీద ఏర్పడ్డ చిరుచెమట బిందువుల్ని సున్నితంగా తుడుచుకొన్నాడు జేబురుమాలుతో. "ఇంక ఫరవాలేదు. కాస్సేపట్లో లేస్తుంది. కొంచెం బార్లీ వాటరివ్వండి." అని వసారాలోకి వచ్చాడు డాక్టర్. రాఘవయ్య స్తిమితపడ్డ హృదయంతో అనుసరించాడు.

"దేవుడులా రక్షించారు నా కూతుర్ని. మీ మేలు మరువలేను!" అన్నాడు కృతజ్ఞతా సూచకంగా రాఘవయ్య. "ఆఁ! మందు సరిగ్గా పడాలి అంతే. జబ్బు తక్కువని తగ్గిపోతుంద"న్నాడు డాక్టరు వెంకటరత్నం చేతులు తుడుచుకొంటూ. "చిత్తం. అంతేనండి" అన్నాడు రాఘవయ్య నమ్రతగా. ఎత్తుపళ్లు బయట పడకుండా జాగ్రత్తగా ఒక చిరునవ్వు నవ్వేడు డాక్టరు వెంకటరత్నం. డాక్టరన్నాడు, "చూశారూ! ఈ మెడిసిన్ ప్రాక్టీస్ చాలా కష్టమండీ. అసలు జబ్బును డైయాగ్నొస్ చెయ్యడంలోనే తెలుస్తుంది డాక్టరు తెలివి. తర్వాత మందు ఇవ్వడమంటారా, ఎవరైనా ఇచ్చేయ్యొచ్చు!" కళ్ళప్పగించి చూస్తూ కూర్చొన్నాడు రాఘవయ్య. డాక్టరు వెంకటరత్నం డాక్టర్ల జీవితంలో వున్న కష్టసుఖాల్ని విడమర్చి వివరించాడు చాలాసేపు రాఘవయ్యకి.

స్వతహాగా ఓ మాదిరి మనిషయినప్పటికీ తను చాలా తెలివైన వాడిననుకుంటాడు డాక్టరు వెంకటరత్నం! స్వోత్కర్ష విపరీతంగా వుంది మనిషి దగ్గర. అందరికీ కాకపోయినా చాలామంది డాక్టర్లకుండే 'దీర్ఘ రోగం' అది! స్కూలు ఫైనల్లో టోటల్, ఇంటర్మీడియట్లో డిస్టింక్షన్ ఇవన్నీ జాగ్రత్తగా జ్ఞప్తి ఉంచుకొని మాటల సందర్భంలో కక్కడం వెంకటరత్నానికో అలవాటు. ఇంటికి అమ్మవచ్చే కూరల వాడితో గంటగంటన్నరసేపు బేరమాడుతాడు. అవతల పేషంట్లు తన తెలివిని చూడాలని! మామూలు వ్యవహారాల్లో కూడా అతి తెలివిని ఉపయోగించాననుకొంటాడు. అందరిదీ ఒక దారి అయితే తనదింకొక దారి! అందరూ రేడియోలు కొనుక్కుంటే తను రేడియో స్వంతంగా తయారుచేశాడు. అది ఏ స్టేషన్నీ కాచ్ చేయలేదు తర్వాత ఒక రేడియో ఇంజనీర్ను పట్టుకొని తిప్పలు పడ్డాడు. చిన్న చిన్న విషయాల్లో కూడా అతి తెలివిని ఉపయోగించడంవల్ల కొన్ని విషయాల్లో దెబ్బలుకూడా తిన్నాడు. కాని అలాంటివాటిని లెక్కపెట్టే మనిషి కాడు డాక్టర్ వెంకటరత్నం.

కాని డాక్టరుగా బాగానే వెలుగుతున్నాడు వెంకటరత్నం. గుర్రబ్బండీ ఒకటికొన్నాడు ఈ మధ్య పేషంట్ల ఇళ్ళకి వెళ్ళి రావడానికి. కారు కొనలేక కాదు, అందులో ఒక కీలకంవుంది. ప్రతియింటిదగ్గర ఒక అర్ధరూపాయి వసూలు చేస్తాడు బండీవాడు. రోజుకి ఎలాలేదన్నా పది పదిహేను పోగడతాయి. అది కూడా డాక్టరు చేతిలోకే పోతాయి. బండికయ్యే ఖర్చుపోగా నెలకి కనీసం నూటయాభై రూపాయలు మిగులుతాయి. డాక్టరు బండి సంపాదిస్తోందన్నమాట! బిల్లు విషయంలోకూడా చాలా జాగ్రత్తగా, నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా వుంటాడు. రోగికి జబ్బు సగం తగ్గిందనగానే అసలు మళ్ళగానే మూడొంతులు ఫీజు వసూలు చేస్తాడు. రోగం ఎంత గడ్డుదైనా, ఆశలేకపోయినా ఒప్పుకొంటాడు. అంతమాత్రంలో అది డబ్బుకక్కుర్తికని ఎవ్వరూ అనుకోరని వెంకటరత్నానికి తెలుసు. పైగా అందుచేత "మంచి డాక్టరు" అని పేరు వస్తోంది.

అప్పుడే భోజనంచేసి వచ్చి ఆఫీసులో పడక కుర్చీలో కూర్చొని పేపరు చదవడానికి ఉపక్రమించాడు డాక్టరు వెంకటరత్నం. ఇంతలో సూర్యనారాయణగారు ఖంగారుగా వచ్చారు. ఆదుర్దాగా "మా అబ్బాయికి చాలా సీరియస్‌గా వుంది. త్వరగా మీ రొకసారి రావాలి" అన్నాడు. చిరునవ్వు నవ్వేడు డాక్టరు వెంకటరత్నం. ఎదుటివాళ్లు ఎంత ఆత్రుతగా వున్నా చిరునవ్వునవ్వడం వెంకటరత్నానికో అలవాటు.

గుర్రబ్బండీ దిగాడు వెంకటరత్నం. వెనకాలే సూర్యనారాయణగారు మందు పెట్టె పట్టుకు దిగారు. ఇంజక్షనిచ్చాడు వెంకటరత్నం. అందరూ ఆదుర్దాగా చూస్తున్నారు. గడియారంకేసి చూస్తూ కూచొన్నాడు వెంకటరత్నం.

అయిదు నిముషాలు ..

ఇంటిల్లి పాదీ గొల్లుమన్నారు. "చెయ్యి దాటిపోయింది! అంతా ఖర్మ. ఆయుషు తీరిపోయింది వెళ్ళిపోయాడు. మనం నిమిత్త మాత్రులం సూర్యనారాయణగారూ" అన్నాడు ఆయన్ని ఓదారుస్తూ డాక్టర్ వెంకటరత్నం.